
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 18 । మే । 2025



టన్ను చీనీ రూ.37 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.37 వేలు, కనిష్టంగా రూ.5 వేల ప్రకారం ధర పలికాయి.



నమో నారసింహ

పెన్నోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఉత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

గరిష్టం/కనిష్టం

36.6°/22.9°

జిల్లా పరిధిలో శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం

- ఆర్‌పీఎఫ్ సౌత్ సెంట్రల్ రైల్వే ఐజీ ఆరోమాసింగ్ ఠాగూర్



ఐజీ ఆరోమాసింగ్ ఠాగూర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్‌పీఎఫ్ అధికారులు

ధర్మవరం అర్బన్: రైల్వే ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఆర్‌పీఎఫ్ సౌత్ సెంట్రల్ రైల్వే ఐజీ ఆరోమాసింగ్ ఠాగూర్ తెలిపారు. శనివారం ఆమె స్థానిక రైల్వేస్టేషన్‌లోని ఆర్‌పీఎఫ్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆర్‌పీఎఫ్ పరిధిలో ఇప్పటి వరకు నమోదైన కేసుల వివరాలు, దర్యాప్తు పూర్తి చేసిన కేసుల వివరాలను ఆర్‌పీఎఫ్ సీఐ నాగేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్‌పీఎఫ్ మహిళా సిబ్బందికి ఏర్పాటు చేసిన భవనాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... ఆర్‌పీఎఫ్ విభాగంలో పనిచేసే మహిళలకు మరింత భద్రతను కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గుంతకల్లు డివిజన్ కమిషనర్ మురళీకృష్ణ, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ అనిల్ కుమార్‌సింగ్, రేణిగుంట అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాల్‌రెడ్డి, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ రోహిత్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు రికార్డులు సక్రమంగా భద్రపర్చాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు



కోర్టు గదులను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమారావు, ఏడీజే శైలజ

హిందూపురం: వివిధ కేసులకు సంబంధించి కోర్టు రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమారావు సూచించారు. కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో ఇటీవలే పాత న్యాయస్థాన సముదాయంలోని కోర్టులను పశుసంవర్ధక కార్యాలయ భవనంలోకి మార్పు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం జిల్లా జడ్జి భీమారావు, అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజతో కలిసి నూతన కోర్టు భవన సముదాయాలను పరిశీలించారు. ఈ సందర్భంలోనే జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో రికార్డులు అస్తవ్యస్తంగా ఉండటాన్ని చూసి జిల్లా జడ్జి విస్మయం వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణలో అశ్రద్ధ పనికి రాదన్నారు. అనంతరం అదనపు జిల్లా జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి పలు న్యాయస్థానాలు, న్యాయమూర్తుల గదులను పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మీహారిక, ప్రత్యేక మెజిస్ట్రేట్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

భయపెట్టి.. పోలీసులతో బెదిరించి

- పింఛన్ కోసం లంచంలో మరో ట్విస్ట్
- మహిళను బెదిరించి మరో వీడియో చేయించిన వైనం

చిలమత్తూరు: పింఛన్ మంజూరు కోసం ఓ మహిళ నుంచి ఏకంగా రూ.10 వేలు లంచం డిమాండ్ చేసిన ఘటన వైరల్ కావడంతో టీడీపీ నేతలు నష్టనివారణ చర్యలకు దిగారు. వీడియోలో మాట్లాడిన మహిళను టీడీపీ నేతలు భయపెట్టడంతో పాటు పోలీసులతోనే బెదిరించి మరో వీడియో రూపొందించి సోషల్ మీడియాలో ఉంచారు.

తీవ్ర చర్చనీయాంశమైన సాక్షి కథనం..

పింఛన్ కోసం లంచం అడిగారని, అంత డబ్బు తనవద్ద లేక చెవిదుద్దులు తాకట్టు పెట్టేందుకు వచ్చానంటూ హిందూపురం 12 వార్డుకు చెందిన ఓ మహిళ ఓ వ్యక్తితో మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌కాగా, దీనిపై శనివారం 'సాక్షి'లో 'పింఛన్ కోసం లంచం' శీర్షికన కథనం ప్రచురితమైంది. కూటమి పాలనకు అద్దం పడుతున్న ఈ వార్త జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశం కాగా, ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలు రంగంలోకి దిగారు. మరోవైపు ఉదయం నుంచే పోలీసులు, టీడీపీ ప్రజాప్రతినిధులు సదరు మహిళను నేరుగా, ఫోన్ల ద్వారా సంప్రదించి బెదరగొట్టేశారు. ఇక రెండో పట్టణ సీఐ కూడా ఆమెను భయపెట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే బలవంతంగా ఆమెతో మరో వీడియో చేయించారు. అందులో తనను ఎవరూ లంచం అడగలేదని చెప్పించి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. టీడీపీ నేతలు... ఇలా ఓ మహిళను భయపెట్టి తమకు అనుకూలంగా వీడియో చేయించడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు.

విశ్వమంత సంబరం

- సందడిగా జేఎన్‌టీయూ (ఏ) 14వ స్నాతకోత్సవం
- చాన్స్‌లర్ హోదాలో హాజరైన గవర్నర్ జస్టిస్ నజీర్
- డాక్టర్ చావా సత్యనారాయణకు గౌరవ డాక్టరేట్ ప్రదానం
- విద్యార్థులకు బంగారు పతకాల బహూకరణ

లక్ష్యం వైపు దృష్టి నిలిపారు. ఆత్మవిశ్వాసం, కృషితో 'బంగారు' కలను నెరవేర్చుకున్నారు. గవర్నర్ చేతుల మీదుగా పతకాలనందుకుని కేరింతలు కొట్టారు. తల్లిదండ్రులకు సంతోషం పంచారు. సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. అతిథుల స్ఫూర్తివంతమైన మాటలను విని ఉప్పొంగారు. రాయలసీమకే తలమానికంగా నిలిచిన అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ 14వ స్నాతకోత్సవ సంబరం అంబరమంటింది.



జేఎన్‌టీయూ వీసీ, రిజిస్ట్రార్, పాలకమండలి సభ్యులతో చాన్స్‌లర్/ గవర్నర్ అబ్దుల్ నజీర్, గౌరవ డాక్టరేట్ గ్రహీత చావా సత్యనారాయణ



స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, తదితరులు

అనంతపురం: జేఎన్‌టీయూ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన స్నాతకోత్సవానికి చాన్స్‌లర్ హోదాలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. గౌరవ డాక్టరేట్ గ్రహీత డాక్టర్ చావా సత్యనారాయణ, వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు, ముఖ్య అతిథి, కాన్పూర్ ఐఐటీ ఎమిరటర్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఆర్. మాధవ్, పాలక మండలి సభ్యులు, డీన్లు వేదికపై ఆసీనులయ్యారు. చాన్స్‌లర్ హోదాలో ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగం ఆద్యంతమూ విద్యార్థులు చప్పట్లతో హోరెత్తించారు. ప్రసంగం ప్రారంభంలో 'జేఎన్‌టీయూ విద్యార్థులు బంగారు బిడ్డలు' అంటూ గవర్నర్ అనడం ఆకట్టుకుంది. డాక్టర్ చావా సత్యనారాయణకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం ద్వారా వర్సిటీ కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరింది.

సందడే.. సందడి

స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని పీజీ, పీహెచ్‌డీ, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. మొత్తం 41 బంగారు పతకాలు ఇవ్వగా, 27 బంగారు పతకాలు అమ్మాయిలే సాధించడం గమనార్హం. ఈ సందర్భంగా విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. 'బంగారు' క్షణాలను సెల్ఫీలు తీసుకుని పదిలపరచుకున్నారు.విద్యార్థుల తల్లి దండ్రులు, వారి బంధువులతో వర్సిటీలో సందడి వాతావరణం నెలకొంది. పతకాలు పొందిన బిడ్డలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు.

దక్షిణాదిలోనే ఘనత..

జేఎన్‌టీయూ (ఏ) వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు స్నాతకోత్సవాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. వర్సిటీ సాధించిన ప్రగతిని వివరించారు. ఏకంగా 90 వేల మంది వర్సిటీ విద్యార్థులు నైపుణ్య కోర్సులను పూర్తి చేశారని, దక్షిణ భారతదేశంలోనే ఈ ఘనత సాధించిన తొలి వర్సిటీగా జేఎన్‌టీయూ ఖ్యాతి దక్కించుకుందన్నారు. 'ద టైమ్స్ ఇండియా వరల్డ్ ర్యాంకింగ్'లో 801–1,000 ర్యాంకు దక్కించుకుందన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సులో మైనర్ డిగ్రీని ప్రవేశపెట్టామని,అపార్ అనుసంధానంతో అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. రూ.22 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టామన్నారు. గేట్ – 2024లో జాతీయ స్థాయిలో 25 ర్యాంకులు వచ్చాయని, జాతీయ స్థాయిలో పి. హేమంత్ రెడ్డి ఏడో ర్యాంకు,కే. జ్ఞానేశ్వర రెడ్డి 144వ ర్యాంకు సాధించి వర్సిటీ కీర్తిని ఇనుమడింపజేశారన్నారు. మొత్తం 33 పేటెంట్లు, 354 జర్నల్స్, 72 పుస్తకాలు, 1,500 పేపర్లు పబ్లిష్ చేసినట్లు పేర్కొన్నారు. 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్'లో వర్సిటీ భాగస్వామి కావడం గర్వకారణమన్నారు.

గవర్నర్ ప్రశంస..

స్నాతకోత్సవ నిర్వహణపై గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులందరూ మంచి క్రమశిక్షణతో ఉన్నారంటూ ప్రశంసలు గుప్పించారు. ఇంతటి చక్కటి వాతావరణంలో సాగిన కార్యక్రమాన్ని గతంలో ఎన్నడూ చూడలేదంటూ కితాబిచ్చారు.

విజయవంతం..

స్నాతకోత్సవం నిర్దేశించిన సమయానికి ప్రారంభమైంది. ఎలాంటి చిన్న తప్పిదం లేకుండా విజయవంతంగా ముగిసింది. బంగారు పతకాలు దక్కించుకున్న విద్యార్థులతో గవర్నర్ సరదాగా ముచ్చటించారు. ఆరు పతకాలు దక్కించుకున్న విద్యార్థి నంద్యాల పూజిత్ కుమార్ రెడ్డిని ఉద్దేశించి.. బంగారు పతకాలు చాలా బరువుగా ఉన్నాయంటూ సరదాగా వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్. కృష్ణయ్య, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



స్నాతకోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సింధూర తదితరులు





పతకాలు అందుకున్న సంతోషంలో..

'బంగారు' కొండలు వీరే..



గవర్నర్ చేతులమీదుగా ఆరు బంగారు పతకాలు అందుకున్న నంద్యాల పూజిత్‌కుమార్ రెడ్డి

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

సమాజంలోకి అడుగుపెట్టాక కొత్త అనుభవాలు ఎదురవుతాయి. నేర్చుకున్న అంశాలను పరిశ్రమకు అనుసంధానం చేయాలి. భవిష్యత్తు సౌర, పవన విద్యుదుత్పత్తిదే. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి. –మాధవ్, ఐఐటీ కాన్పూర్ ఎమిరటర్స్ ప్రొఫెసర్

నాన్న కష్టాన్ని వృథా పోనివ్వను..

నాన్న బ్రహ్మానందా రెడ్డి కడప స్టీల్ ఫ్యాక్టరీలో పనిచేస్తూ నన్ను చదివిస్తున్నారు. నా ఉన్నతి కోసం ఆయన పడుతున్న కష్టం వృథాగా పోనీరాదని, బాగా చదవాలని నిశ్చయించుకున్నా. ప్రొఫెసర్ కే. హేమ చంద్రా రెడ్డి, విభాగాధిపతి డాక్టర్ కళ్యాణి రాధ, డాక్టర్ ఓం ప్రకాష్ మార్గదర్శకత్వంలో మంచి మార్కులు తెచ్చుకుని ఆరు గోల్డ్ మెడల్స్ సాధించా. – పూజిత్ కుమార్ రెడ్డి, వైఎస్సార్ జిల్లా



షేక్ సాజిద్ మురద్ (సివిల్) | దూదేకుల సబియా సుల్తానా(ఈఈఈ) | సయ్యద్ మహమ్మద్ అక్రమ్(మెకానికల్) | కె. వెంకట కార్తిక్ (ఈసీఈ) | ముచెర్ల రాజు రమ్య లక్ష్మి(సీఎస్ఈ) | ఎన్ఎల్ చందన లక్ష్మి ప్రియ(ఐటీ) | సెట్లం అఖిల (ఫుడ్‌టెక్నాలజీ) | వెంకట నాగమణి (ఏఐ, డేటా సైన్స్)



భరత్ భవిత (సీఎస్ఈ) | చల్లా నాగేంద్రబాబు సీఎస్ఈ (డేటా సైన్స్) | హర్షిత, సీఎస్ఈ (ఏఐ, మెషిన్ లర్నింగ్) | అభినయన, సీఎస్ఈ (ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్) | పి. లిఖిత రెడ్డి (బీఫార్మసీ) | గోవుల వాల్మీకి హరిత (సివిల్) | పి. ఫయద్ ఆలీ (ఈఈఈ) | పి. వనిత (మెకానికల్)



వి. శ్రీ వైష్ణవి (ఈసీఈ) | టి. సుప్రజ (కంప్యూటర్ సైన్సెస్) | ఎం. జాహ్నవి కెమికల్ ఇంజనీరింగ్ | వి. సునీత, ఎంటెక్ (స్ట్రక్చరల్ ఇంజనీరింగ్) | పి. అమృత బాబు (సివిల్) | పుల్లా భవ్యశ్రీ (ఈఈఈ) | వి. మహత మెకానికల్ | ఓ.గ్లైసియా (ఈసీఈ) | ఎం. వాసంతి (సీఎస్ఈ)

మంత్రి సవిత వల్లే 'ప్రీకాట్' మూత

- కార్మికుల ఉసురు కూటమి పెద్దలకు తగులుతుంది
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్
- మిల్లు గేటు ఎదుట కార్మికులు, పార్టీ నేతలతో కలిసి ఆందోళన



స్పిన్నింగ్ మిల్లు గేటు ఎదుట పార్టీ నేతలు, కార్మికులతో కలిసి ఆందోళన చేస్తున్న ఉషశ్రీచరణ్

పరిగి: నాలుగు దశాబ్దాలకుపైగా వేలాది మంది కార్మికులు, కూలీలకు ఉపాధి కల్పించిన కొడిగెనహళ్లి ప్రీకాట్ మెరీడియన్ స్పిన్నింగ్ మిల్లు మూత పడటానికి మంత్రి సవిత వైఖరే కారణమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆరోపించారు. ప్రభుత్వం విద్యుత్ చార్జీల రాయితీ ఇవ్వకపోవడంతో మిల్లు పడింది. ప్రభుత్వ వైఖరిని, మంత్రి సవిత నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ శనివారం ఉషశ్రీచరణ్ ప్రీకాట్ మిల్లు గేటు వద్ద కార్మికులు, కాంట్రాక్ట్ వర్కర్లతో పాటు వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ, నూతన పరిశ్రమల స్థాపనతో ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తామని చెప్పిన కూటమి పార్టీల నేతలు ఇప్పుడు ఉన్న కంపెనీలను మూసివేస్తూ ఉపాధిని దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రిగా సవిత బాధ్యతలను స్వీకరించిన తరువాత నియోజకవర్గంలో ఒక్క పరిశ్రమ స్థాపనకు కృషి చేయాలేదన్నారు.

వేలాది కుటుంబాలను పోషించిన మిల్లు

నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పడిన ప్రీకాట్ మెరీడియన్ స్పిన్నింగ్ మిల్లు వేలాది కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తూ అండగా నిలిచిందని ఉషశ్రీచరణ్ తెలిపారు. అలాంటి మిల్లుకు కూటమి ప్రభుత్వం విద్యుత్ రాయితీ ఇవ్వకపోవడంతో యాజమాన్యం మూసివేసిందన్నారు. దీంతో మిల్లు కార్మికుల కుటుంబాలు నేడు రోడ్డున పడే పరిస్థితి తలెత్తిందన్నారు. ఇందుకు కూటమి సర్కార్ వైఖరితో పాటు మంత్రి సవిత చేతకాని తనమే కారణమన్నారు. ఇప్పటికైనా మంత్రి సవిత ప్రత్యేక చొరవ చూపి ప్రీకాట్ మెరీడియన్ స్పిన్నింగ్ మిల్లును తెరిపించేందుకు అన్ని విధాలా కృషి చేయాలని ఉషశ్రీచరణ్ డిమాండ్ చేశారు. లేదంటే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల, కర్షకుల ఉసురు ఊరికే పోదని తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్దఎత్తున మిల్లు కార్మికులు పాల్గొన్నారు.

తిరంగా.. మదినిండా

- పుట్టపర్తిలో ఘనంగా తిరంగా ర్యాలీ
- సైనికులకు అండగా నిలుద్దామని కలెక్టర్, ఎస్పీ పిలుపు



పుట్టపర్తిలో 'తిరంగా ర్యాలీ' నిర్వహిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, ప్రజలు

పుట్టపర్తి టౌన్: ప్రతి ఒక్కరిలోనూ దేశభక్తి భావం ఉప్పొంగింది. మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. 'భారత్ మాతాకీ జై' నినాదం మార్మోగింది. 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం చేసిన సైనికులకు మద్దతుగా శనివారం పుట్టపర్తిలో నిర్వహించిన తిరంగా యాత్ర ఆద్యంతం దేశభక్తిని చాటింది. కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న, ఎమ్మెల్యే సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తిరంగా యాత్ర ర్యాలీ పట్టణంలో హనుమాన్ కూడలి నుంచి విద్యాగిరి ఆర్చ్ వరకూ సాగింది. ర్యాలీలో పాల్గొన్న యువత, విద్యార్థులు, పట్టణ ప్రజలు 'వందేమాతరం', 'భారత్ మాతాకీ జై', 'మరోనాయక్ అమర్ రహే' అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న మాట్లాడుతూ.. దేశ భద్రత, సమగ్రత కోసం మనమంతా ఏకతాటిపై నడవాలని పిలుపునిచ్చారు. మనమంతా సురక్షితంగా ఉండేందుకు ప్రాణాలు అర్పిస్తున్న సైనికులకు అందరం మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. 'ఆపరేషన్ సిందూర్'లో మన సైనికుల పోరాటం మరువలేనిదన్నారు. దేశ భద్రత విషయంలో భారత్ రాజీ పడబోదన్న సందేశాన్ని మన సైనికులు ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. సైనికులకు మనమంతా నిలుద్దామని పిలుపునిచ్చారు.

ఈదురు గాలులతో భారీ వర్షం

- సోమందేపల్లిలో 29.2 మి.మీ వర్షపాతం నమోదు
- తాడిమర్రిలో నేలకొరిగిన అరటిచెట్లు



గుడ్డంపల్లిలో ఈదురు గాలులకు నేలకొరిగిన అరటి

పుట్టపర్తి అర్బన్/తాడిమర్రి: ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందే పలకరించిన వరుణుడు ముందస్తుగా మురిపిస్తున్నాడు. శనివారం రాత్రి కూడా జిల్లాలోని పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జిల్లా కేంద్రం పుట్టపర్తిలో భారీ వర్షం కురవడంతో వీధులన్నీ జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. ఇక శుక్రవారం రాత్రి జిల్లాలోని 10 మండలాల పరిధిలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అత్యధికంగా సోమందేపల్లి మండలంలో 29.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక పెనుకొండ మండలంలో 26 మి.మీ, బత్తలపల్లి 24.4, ముదిగుబ్బ 22.4, సీకే పల్లి 16.6, తాడిమర్రి 6.2, గాండ్లపెంట 2, ఎన్‌పీ కుంట 1.6, ధర్మవరం 1.2, పరిగి మండలంలో ఒక మి.మీ చొప్పున వర్షం కురిసింది. రాగల రెండు రోజులూ జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి తాడిమర్రి మండలంలో కురిసిన వర్షానికి గుడ్డంపల్లి గ్రామంలో కోడిమూర్తి ఓబుళపతికి చెందిన అరటితోటలో తీవ్రంగా దెబ్బతినింది. కాపునకు వచ్చిన 4,000 అరటిచెట్లు నేలకు ఒరిగాయి. దీంతో రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

క్లుప్తంగా

కిచెన్, రూఫ్ గార్డెన్‌తో లాభాలు



ఎనుములపల్లిలో కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: స్వంతంగా తయారు చేసుకునే కిచెన్ గార్డెన్, రూఫ్ గార్డెన్‌తో ఎన్నో లాభాలు ఉన్నాయని జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం ఎనుములపల్లిలో కిచెన్ గార్డెలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇంటి వద్ద ఉన్న ఖాళీ స్థలంలో కూరగాయలు, పండ్ల మొక్కలు వేసుకోవడంతో ఇంటికి సరిపడా కూరగాయలు పండ్లు అందుబాటులో ఉంటాయన్నారు. దీంతో మార్కెట్ ధరలు సాధారణ స్థితికి వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ కిచెన్ గార్డెన్, రూఫ్ గార్డెలను తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఉద్యాన అధికారి నవీన్ కుమార్, సహాయకులు వేమారెడ్డి , రామాంజనేయులు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

'కియా'లో సినిమా షూటింగ్



కియా పరిశ్రమలో సినిమా షూటింగ్ చేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: వరుణ్ తేజ్ హీరోగా నూతనంగా తెరకెక్కిస్తున్న సినిమా షూటింగ్‌లోని పలు సన్నివేశాలను కియా పరిశ్రమ ఆవరణలో శనివారం చిత్రీకరించారు. పరిశ్రమలోనే మరో రెండు రోజుల పాటు సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లు చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు.

శోత్రియం క్షోభ


- తంగేడుకుంట మొత్తం శోత్రియం భూములే..
- ఏళ్లుగా పాసు పుస్తకాల కోసం రైతుల నిరీక్షణ
- అధికారంలోకి రాగానే ఇప్పిస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూర హామీ
- ఏడాది పూర్తవుతున్నా పట్టించుకోని వైనం
- సంక్షేమ ఫలాలకు దూరమైన రైతులు

తంగేడుకుంట.. ఇదో విలక్షణమైన పంచాయతీ. అక్కడున్నవన్నీ శోత్రియం భూములే. పది గ్రామాల రైతులు ఎన్నో ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటున్నా పట్టాదారు పాసుపుస్తకాలకు మాత్రం నోచుకోలేదు. ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ప్రయోజనం లేకపోవడంతో ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ ఫలాలకు కూడా దూరమైపోయారు.

ఓడీచెరువు: మండలంలోని తంగేడుకుంట పంచాయతీ మొత్తం శోత్రియం భూములే ఉన్నాయి. దీంతో పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరులో జాప్యం జరుగుతోంది. రైతులు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని మండలాధికారులు మొదలు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను ఎన్నోసార్లు వేడుకున్నారు. అయినా వారి సమస్యకు మాత్రం పరిష్కారం దొరకడం లేదు. గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శోత్రియం భూముల సమస్యను పరిష్కరించి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయిస్తానని ప్రస్తుత ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తున్నా ఇంత వరకూ తమ సమస్యను పరిష్కరించలేదని గ్రామస్తులు వాపోతున్నారు

గత ప్రభుత్వంలో 170 మందికి పాసు పుస్తకాలు..

తంగేడుకుంట పంచాయతీకి సంబంధించిన భూములకు పట్టాదారు పాసుపుస్తకాల మంజూరులో జాప్యానికి ముఖ్య కారణం ఆ గ్రామ చరిత్ర. 1382వ సంవత్సరంలో హరిహర బుక్కరాయలు హెబ్బార్ కళే వంశస్తులకు 9,999 ఎకరాల భూమిని ఇనాముగా యిచ్చినట్లు లభించిన ఆధారాలను బట్టి తెలుస్తోంది. ప్రస్తుతం వీరి వంశస్తులు ఇక్కడే నివసిస్తున్నారు. 1948 సంవత్సరంలో ఎస్టేట్ అనుభవం రద్దు తరువాత 1951లో అడ్మినిస్ట్రేషన్ చిట్టా విడుదల చేసి, అనుభవంలో ఉన్న పత్రాల మేరకు జాబితా తయారు చేశారు. 1978లో నోటిఫై చేసిన భూములకు పట్టాదారు పాసుపుస్తకాల మంజూరుకు కోర్టు అనుమతి ఇచ్చింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మొత్తం 170 మందికి పాసుపుస్తకాలు మంజూరయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకూ మళ్లీ మిగతా వారి పాసుపుస్తకాల మంజూరును పట్టించుకునేవారే కరువయ్యారు.



తంగేడుకుంట ఏరియల్ వ్యూ

పంచాయతీ పేరు	తంగేడుకుంట
పంచాయితీలోని గ్రామాలు	10
విస్తీర్ణం (ఎకరాలు)	9,999
జనాభా	3,825
మొత్తం కుటుంబాల సంఖ్య	1,346
మంజూరైన పాసుపుస్తకాలు	250



ఇబ్బందులు పడుతున్న రైతులు..

పంట రుణాలు, రెన్యువల్స్, క్రాప్ ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం ఆన్‌లైన్ చేసేందుకు కచ్చితంగా పట్టాదారు పాసుపుస్తకం అవసరం. సబ్సిడీ విత్తనాలకు, సబ్సిడీ ద్వారా లభించే బిందు, తుంపర సేద్య పరికారాల మంజూరుకు, ఉపాధి పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి, సబ్సిడీ ఎరువుల కొనుగోలుతో పాటు ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలు పొందాలంటే పట్టాదారు పుస్తకం ఉండాల్సిందే. అయితే పట్టాదారు పుస్తకాలు లేకపోవడంతో వెయ్యి మందికి పైగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా నేతలు స్పందించి అధికారులపై ఒత్తిడి తెచ్చి పాసుపుస్తకాలు మంజూరు చేయాలని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు.

అన్నింటికీ ఇబ్బంది పడుతున్నాం



ఎన్నో ఏళ్ల నుంచి పట్టాదారు పాసు పుస్తకాల కోసం ఎదురు చూస్తునే ఉన్నాం. పట్టాదారు పాసు పుస్తకం లేకుంటే అన్నింటికీ ఇబ్బందులే. పంట రుణాల రెన్యూవల్ కోసం ఏటా అడంగల్ రాయించుకొని తహసీల్దార్ కార్యాలయంలో సంతకం చేయించుకొని పోవాలి. దీని కోసం నాలుగైదు సార్లు తిరుగుతున్నాం. ప్రభుత్వం నుంచి వచ్చే ఎలాంటి ప్రయోజనాలు అందడం లేదు. అధికారులు కరుణించి సత్వరమే పాసు పుస్తకాలు మంజూరు చేయాలి.

– మధు, తంగేడుకుంట, ఓడీ చెరువు మండలం

శోత్రియం పట్టా ఉంటేనే పాసు బుక్కు



సాధారణ డాక్యుమెంట్ల ఆధారంగా శోత్రియం భూముల రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయలేం. వారికున్న డాక్యుమెంట్ల ఆధారంగా మొదట కలెక్టరేట్ నుంచి శోత్రియం పట్టా పొందాలి. శోత్రియం పట్టా పొందిన రైతులకు మాత్రమే పాసు పుస్తకాల మంజూరుకు సాధ్యమవుతుంది. ఇటీవల నిర్వహించిన గ్రామసభలో 18 మంది రైతుల నుంచి ఫిర్యాదులు అందాయి. పరిశీలించి అర్హులైన వారికి పాసుపుస్తకాల మంజూరుకు ఉన్నతాధికారులకు పంపాము.

– అనంతాచారి, తహసీల్దార్, ఓడీచెరువు మండలం

ఎద్దుల పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ముదిగుబ్బ: మండల పరిధిలోని నాగారెడ్డిపల్లిలో శనివారం శ్రీరాముల ఉత్సవాల్లో భాగంగా ఎద్దుల పోటీలను మంత్రి సత్యకుమార్ ప్రారంభించారు. కాసేపు అక్కడే ఉండి పోటీలను తిలకించారు. ఆ తర్వాత ముదిగుబ్బ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంభన కోసం ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ముదిగుబ్బ మండలానికి 500 కుట్టు మిషన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు.

హైపర్ టెన్షన్‌తో జాగ్రత్త



ర్యాలీలో పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: హైపర్ టెన్షన్‌తో ఒక్కోసారి ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం వరల్డ్ హైపర్ టెన్షన్ డేని పురస్కరించుకొని జిల్లా వైద్యాధికారులు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో ఒత్తిడులు, నిద్రలేమి, జంక్ ఫుడ్, జన్యుపరమైన కారణాలతో జీవన విధానంలో మార్పులు వచ్చాయన్నారు. హైబీపీతో ఒక్కోసారి రక్తనాళాలు చిట్లిపోయే ప్రమాదం ఉందన్నారు. వైద్యారోగ్యశాఖ 2023లో నిర్వహించిన సర్వేలో జిల్లాలో 64,471 మంది బీపీ బారిన పడినట్లు తేలిందన్నారు. అదే 2024లో స్క్రీనింగ్ చేయగా 1.05 లక్షల మంది ఉన్నట్లు నిర్ధారించారన్నారు. నిద్రలేమి, అధిక ఉప్పు, శారీరక శ్రమ లేకున్నా, ఊబకాయ సమస్యలతో బీపీ వస్తోందన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే బీపీని నియంత్రణలో ఉంచుకోవచ్చన్నారు.

యర్రగుంటపల్లిలో చోరీ



దుండగులు ధ్వంసం చేసిన బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

నల్లచెరువు: మండల పరిధిలోని యర్రగుంటపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుల వివరాలమేరకు.. యర్రగుంటపల్లికి చెందిన వెంకట మల్లయ్య దంపతులు శుక్రవారం రాత్రి ఇంట్లో భోజనం చేసి నిద్రపోయేందుకు ఇంటిపైకి వెళ్లారు. అయితే అర్ధరాత్రి సమయంలో ఇంట్లో ఎవరూ లేరని గమనించిన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. గుట్టు చప్పుడు కాకుండా ఏకంగా ఇంట్లోని బీరువాను సమీపంలోని వ్యవసాయ పొలాల్లోకి తీసుకెళ్లి పగలగొట్టి అందులోని రూ.1. 30 లక్షల నగదు, తులం బంగారు అపహరించారు. ఉదయం ఇంట్లో చోరీ జరిగిందని గ్రహించిన బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ మక్బూల్ బాషా పరిశీలించారు. బీరువాపై ఉన్న వేలి ముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

తనకల్లు: అప్పుల బాధతో మండల పరిధిలోని ఏనుగుగుండు తండాకు చెందిన రామునాయక్ (33) శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలమేరకు... ఏనుగుగుండు తండాకు చెందిన రామలక్ష్మమ్మ కుమారుడైన రామునాయక్ పుట్టుకతోనే దివ్యాంగుడు. డిగ్రీ వరకు చదువుకున్నాడు. అయితే చదువు, ఇతర ఖర్చుల కోసం తెలిసిన వారి వద్ద దాదాపు రూ. 2 లక్షల వరకూ అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు చికిత్స కోసం తనకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే రామునాయక్ మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపి పేర్కొన్నారు.

బెస్త విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

హిందూపురం టౌన్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన బెస్త కుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు బెస్త సేవా సంఘం అధ్యక్షుడు బెస్త లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24న మోడల్ కాలనీ–2లోని జలకంఠేశ్వరస్వామి, గంగమ్మ ఆలయం వద్ద బెస్త భవనంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. పదో తరగతి ఫలితాల్లో 500 మార్కులపై సాధించిన వారికి నగదు బహుమతితో పాటు మెమోంటో, ప్రశంసాపత్రం, ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. మార్కుల జాబితాతో పాటు తల్లిదండ్రుల ఫోన్ నంబరు, అడ్రస్సును ఈనెల 23లోపు 9701886783, 9441823384 సెల్‌ఫోన్ నంబర్లకు పంపాలని సూచించారు.

ఈతకొడుతూ మూర్ఛపోయి యువకుడి మృతి

చిలమత్తూరు: మండల పరిధిలోని మరవకొత్తపల్లి ఎస్సీ కాలనీకి చెందిన సోమశేఖర్ (30) ఈత కొడుతూ మూర్ఛరావడంతో నీట మునిగి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు .. మృతుడు సోమశేఖర్ మండల కేంద్రానికి సమీపంలోని చేనేపల్లి వద్ద ఉన్న బావిలో శనివారం ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఆ సమయంలో మూర్ఛ రావడంతో నీట మునిగి చనిపోయాడు. స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

టీడీపీ కార్యకర్త దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న బాధితుడు ముత్యాలప్ప

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం నరసనాయని కుంట ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న బి.ముత్యాలప్పపై ఆయన బంధువు, టీడీపీ కార్యకర్త తిరుపాలు కట్టెతో దాడి చేయడంతో కాలు విరిగింది. బాధితుడు సర్వజన ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతున్నాడు. ఈనెల 13న జరిగిన దాడి ఘటనకు సంబంధించి బాధితుడు ముత్యాలప్ప, ఆయన కుటుంబ సభ్యుల వివరాల మేరకు... ముత్యాలప్పకు ఇద్దరు సోదరులున్నారు. వీరి ముగ్గురికి కలిపి 12 ఎకరాల భూమి ఉంది. ఎవరికి వారు భాగపరిష్కారాలు చేసుకున్నారు. పెద్దవాడు అయిన ముత్యాలప్ప తన భాగానికి వచ్చిన ఆస్తిని విక్రయానికి పెట్టాడు. ఇటీవల ముత్యాలప్ప సోదరుడి అల్లుడు, టీడీపీ కార్యకర్త తిరుపాలు కలగజేసుకుని మధ్యవర్తిగా ఉంటూ కొనుగోలుదారుడిని పిలిపించాడు. ముత్యాలప్ప చెప్పిన ధరకంటే చాలా తక్కువకు అడగడంతో అమ్మేందుకు ముత్యాలప్ప, ఆయన కుమారులు ఒప్పుకోలేదు. అప్పటి నుంచి తిరుపాలు కోపంతో రగలిపోతున్నాడు. ఈనెల 13న రాత్రి 7 గంటల సమయంలో ముత్యాలప్ప కుమారుడు, ఆయన తమ్ముడి కుమారుడు కలిసి భూమి అమ్మకం విషయమై మాట్లాడుకుంటుండగా... అక్కడికి వచ్చిన తిరుపాలు కట్టెతో దాడి చేశాడు. ఈ దాడిలో ముత్యాలప్ప కుడి కాలు విరిగి తీవ్రగాయమైంది. 108 సకాలంలో రాకపోవడంతో అందుబాటులో ఉన్న ఆటోను పిలవగా... వెళ్లకూడదంటూ ఆటో డ్రైవర్‌ను తిరుపాలు బెదిరించాడు. అప్పటికే సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని ఆటోలో పంపేలా చర్యలు తీసుకున్నారు. సర్వజన ఆస్పత్రిలో ముత్యాలప్ప చికిత్స పొందుతున్నాడు. దాడి ఘటనపై రూరల్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.

కక్ష సాధింపుతోనే అక్రమ అరెస్టులు

- మాజీ మంత్రి శంకర నారాయణ



సాక్షి, పుట్టపర్తి: ఏపీలో రెడ్‌బుక్ రాజ్యాంగం కొనసాగుతోందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు మాలగుండ్ల శంకర్ నారాయణ ఒక ప్రకటనలో విమర్శించారు. అక్రమ మద్యం కేసులో సాక్ష్యాలు లేకున్న తప్పుడు వాంగ్మూలాలను అడ్డు పెట్టుకొని విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌లను వేధిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం కల్తీ జరిగితే, నేడు కూటమి ప్రభుత్వం అవే డిస్టిలరీల నుంచి మద్యం ఎందుకు కొనుగోలు చేస్తోందో చెప్పాలన్నారు. కేవలం రాజకీయ కక్ష సాధింపుతోనే రిటైర్డ్ అధికారులు, సీనియర్ సిటిజన్‌లను వేధిస్తోందన్నారు. ఇప్పటికే కొందరు ఐపీఎస్, ఐపీఎస్ అధికారులను టార్గెట్ చేసుకొని సస్పెన్షన్ వేటు కూడా వేశారన్నారు. కేవలం రాజకీయ కక్ష సాధింపులతోనే అక్రమ అరెస్టులు చేస్తున్నారన్నారు.

జిల్లాలో ఐదు పారిశ్రామిక హబ్‌లు

- భూసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశం



భూసేకరణకు సంబంధించిన మ్యాపులను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో పరిశ్రమల స్థాపన కోసం ఐదు పారిశ్రామిక హబ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు అవసరమైన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో 'జిల్లాలో పరిశ్రమల స్థాపన... భూసేకరణ' అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో పారిశ్రామిక వాడల ఏర్పాటుకు 35 వేల ఎకరాల భూమిని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వీలైనంత త్వరగా భూసేకరణ జరపాలన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు 5 బ్లాక్‌లను గుర్తించాలని, ఆయా మండలాల్లో ఎక్కడ ప్రభుత్వ భూములున్నాయో వాటిని త్వరితగతిన ఏపీఐఐసీకి అప్పగించాలన్నారు. హిందూపురం–లేపాక్షి, చిలమత్తూరు–గోరంట్ల పారిశ్రామిక హబ్‌లతో పాటు మడకశిర హబ్, పెనుకొండ–కియా హబ్, పుట్టపర్తి హబ్‌లు అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జాతీయ రహదారి నుంచి 2 కిలోమీటర్ల దూరంలో పంటలు సాగుచేయని 10 నుంచి 15 వేల ఎకరాల డీ పట్టా భూములున్నాయని, వాటిని గుర్తించి పరిశ్రమల స్థాపనకు భూసేకరించాలన్నారు. రామగిరి, కనగానపల్లి మండలాల్లో సోలార్ పార్కుల కోసం భూమిని గుర్తించి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ సహాని, ఆర్డీఓలు సువర్ణ, ఆనంద్‌కుమార్, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

పరిశుభ్రత జీవితంలో భాగం కావాలి

కొత్తచెరువు: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని కలెక్టర్ చేతన్ సూచించారు. శనివారం కొత్తచెరువులో జరిగిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించి 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. బస్టాండులో చలివేంద్రం ప్రారంభించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'బీట్ ద హీట్' పేరుతో నెల రోజుల పాటు 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



శివశంకర్‌రెడ్డి (ఫైల్)

పెద్దవడుగూరు: మండల పరిధిలోని రావులుడికి గ్రామంలో రైతు శివశంకర్‌రెడ్డి (56) అనే రైతు విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు.. శివశంకర్‌రెడ్డి ఉదయాన్నే రైతులు పుల్లారెడ్డి, ప్రతాప్‌రెడ్డి లతో కలిసి తోట వద్దకు వెళ్లారు. మృతుడు తన పొలం వద్దకు వెళ్లాడు. నీటి తొట్టిలో నీళ్లు లేకపోవడంతో మోటార్ వద్దకు వెళ్లాడు. కరెంటు లేకపోవడంతో సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూడగా ఫీజు కట్ అయి ఉండటంతో ఫీజు వేసేందుకు యత్నించగా విద్యుదాఘాతంతో అక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులకు సంఘటనా స్థలానికి చేరుకొని కన్నీరు మున్నీరయ్యారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జమెదారు అన్వర్‌బాషా తెలిపారు.